క్లుప్తంగా

పల్స్‌పోలియో విజయవంతం చేయండి



మాట్లాడుతున్న వైద్యాధికారిణి పూజిత

రామకుప్పం: మండలంలో ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజలాపురం పీహెచ్‌సీ వైద్యాధికారిణి పూజిత అన్నారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లకు పల్స్ పోలియోపై అవగాహన సమావేశం నిర్వహించారు. పూజిత మాట్లాడుతూ, పుట్టిన శిశువు మొదలు ఐదేళ్లలోపు పిల్లలకు ఆదివారం పోలియో చుక్కలు వేయించాలన్నారు. పిల్లలు పోలియో బారిన పడకుండా చూడటమే లక్ష్యంగా పనిచేయాలన్నారు.

2న రోటరీ కంటి వైద్య శిబిరం

పుంగనూరు: పట్టణంలోని బీఎంఎస్ క్లబ్‌లో మార్చి 2న కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు స్థానిక రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అనిల్‌కుమార్, రాజారెడ్డి తెలిపారు. గురువారం దీనికి సంబంధించి కరపత్రాలను విడుదల చేసి వారు మాట్లాడారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థతో కలసి వైద్యశిబిరాన్ని బెంగళూరుకు చెందిన శంకర్ నేత్రాలయ వైద్య నిపుణులతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చికిత్స చేసి, అవసరమైన వారికి ఆపరేషన్లు చేసి, కళ్లద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు త్యాగరాజు, గణేష్, భాస్కర్, భాస్కర్‌శెట్టి, మునిరాజు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీమా సొమ్ము పంపిణీ



చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారి

పెద్దపంజాణి: మండలంలోని శంకర్రాయలపేట పంచాయతీ గుట్టూరుకు చెందిన పూజారిపల్లి సుజాతకు రూ.2 లక్షల బీమా నగదును గురువారం పంపిణీ చేసినట్లు సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ తిరుమలయ్య, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు హరినాథ్ తెలిపారు. బ్యాంకులో ఖాతా కలిగి ప్రధానమంత్రి జీవన జ్యోతి స్కీమ్ కింద రూ.436 బీమా చెల్లించిన సుజాత భర్త రమణ హఠాన్మరణం చెందాడు. దీంతో బ్యాంకు తరఫున రూ.2లక్షలు అతని భార్య సుజాతకు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారి రాజేష్, సంఘమిత్ర క్రిష్ణవేణి పాల్గొన్నారు.

రెస్కో ఎండీగా ప్రభాకర్



కుప్పం: కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ నూతన ఎండీగా ప్రభాకర్ గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఎండీగా పనిచేస్తున్న సుబ్రమణ్యం ఉద్యోగ విరమణ చేశారు. రెస్కోలో ఏడీగా పనిచేస్తున్న ప్రభాకర్ ఉద్యోగోన్నతిపై ఎండీగా నియమితులయ్యారు.

సారా స్థావరాలపై పోలీసుల దాడి



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

పెద్దపంజాణి: సారా స్థావరాలపై దాడిచేసి 300 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. సారా తయారు చేస్తున్నారనే సమాచారం అందడంతో గురువారం ఉదయం మండలంలోని గంకొండ అటవీ ప్రాంతంలో సిబ్బందితో కలసి దాడి చేసి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. సారా తయారు చేసినా, విక్రయించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

విద్యార్థులకు బహుమతులు



బహుమతులు అందజేస్తున్న నాయకులు

సదుం: స్థానిక జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన సైన్స్‌ఫేర్‌లో రెడ్డివారిపల్లె పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని, గురువారం వారికి బహుమతులు అందజేసినట్లు హెచ్‌ఎం వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధికి సర్పంచ్ హనుమంతరెడ్డి రూ. 2వేలు అందజేశారు. సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

లోక్ అదాలత్ వాయిదా

పలమనేరు: ఈనెల 9న నిర్వహించ తలపెట్టిన జాతీయ లోక్ అదాలత్ ఈనెల 16కి వాయిదా వేసినట్లు స్థానిక సీనియర్ సివిల్ జడ్జి పగడాల శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఇప్పటికే కేసుల రాజీపై సంబంధిత న్యాయవాదులు, పోలీసులు, ఇతర శాఖల అధికారులకు సైతం దీనిపై సమావేశాలను నిర్వహించినట్లు చెప్పారు.

నేడు వైఎస్సార్ ఆసరా

పలమనేరు: మండలంలోని మొరంలో శుక్రవారం ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల సర్పంచుల సంఘ అధ్యక్షులు విశ్వనాథ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

గురువారం పలమనేరు ఆస్పత్రిలో జన్మించిన లీప్ బేబీలు వారి తల్లులతో



సమ్‌థింగ్.. సమ్‌థింగ్..

లీప్ బేబీలు వీరే!

- నాలుగేళ్లకోసారి వీరికి పుట్టినరోజు వేడుకలు
- నియోజకవర్గంలో ప్రత్యేక దినంలో పదిమంది శిశువుల జననం
- సంబరపడుతున్న మాతృమూర్తులు

పలమనేరు: సాధారణంగా ఎవరైనా పుట్టిన రోజుని ఏటా ఘనంగా నిర్వహించుకోవడం పరిపాటి. కానీ పుట్టినరోజుకు సైతం ఓ ప్రత్యేకత కొందరికే దక్కుతుంది. అలాంటి వారే లీపు సంవత్సరంలో జన్మించిన వారు. నాలుగేళ్లకోసారి మాత్రమే ఫిబ్రవరి నెలలో 29 తేదీ వస్తుంది. ఈ తేదీలో పుట్టిన వారు వారి పుట్టినరోజును జరుపుకోవాలంటే మరో నాలుగేళ్లు ఆగాల్సిందే. అందుకే 29న జన్మించిన వారిని ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు.

లీప్ బేబీలు పదిమంది దాకా

పలమనేరు నియోజకవర్గంలో పట్టణంలోని ఏరియా ఆస్పత్రి, వీ.కోటలోని కమ్యూనిటీ ఆస్పత్రితో పాటు స్థానికంగా నాలుగైదు ప్రసూతి వైద్యశాలలున్నాయి. గురువారం రోజు పదిమంది చిన్నారులు పుట్టారు. వీరిలో ఆరుగురు ఏరియా ఆస్పత్రిలోనే జన్మించారు. వీరిలో ఇద్దరికి సాధారణ కాన్పుకాగా నలుగురు సిజేరియన్ చేశారు. మరో మహిళ 108 వాహనంలో ప్రసవించింది. స్థానిక ఆస్పత్రిలో గంగవరం మండలం మామడుగుకు చెందిన సుల్తానా, పలమనేరు మండలం టి.వడ్డూరుకు చెందిన సిమ్రాన్ రెండో కాన్పులో మగ శిశువుకు జన్మనించారు. ఇదే మండలం పి.వడ్డూరుకు చెందిన రాణి రెండో కాన్పులో ఆడపిల్లను, టి.కొత్తూరుకు చెందిన నీలావతి నాలుగో కాన్పులో మగ శిశువును ప్రసవించారు. కొత్త ఇండ్లు గ్రామానికి చెందిన వినోదిని కైతే మరచిపోని అనుభూతినిచ్చింది. పురుటి నొప్పులు పడుతున్న ఆమెను ఆస్పత్రికి 108లో తరలిస్తుండగా అంబులెన్సులోనే పండంటి మగబిడ్డను ప్రసవించింది. వీరింతా లీపు బేబీలుగా మారారు.

మాతృమూర్తుల ఆనందం

ఇక తమ చిన్నారుల పుట్టినరోజు నాలుగేళ్లకోసారి రావడమనేది తలచుకుంటేనే ఒకింత ఆశ్చర్యం, ఆనందం కలుగుతోందని ఆ పసికందుల తల్లులు మాతృత్వ మధురిమల డోలికల్లో విహరిస్తున్నారు. ఇలాంటి ప్రత్యేకత తమకు దక్కడం ఆనందంగా ఉందని చెప్పారు. ఏదేమైనా ఏటా పిల్లలకు బర్త్‌డే వేడుకలను జరుపుకునే పని లేకుండా హాయిగా నాలుగేళ్లకోసారి చేస్తామని చెప్పారు.

పుంగనూరులో..



పుంగనూరు: తన కుమార్తెతో హబీబా షరీఫ్

పుంగనూరు: పుంగనూరు ప్రభుత్వాసుపత్రి గురువారం ఇద్దరు శిశువులకు పురుడు పోసింది. పట్టణంలోని ఎన్ఎస్.పేటకు చెందిన హబీబా షరీఫ్ మూడవ కాన్పులో కుమార్తెకు జన్మనిచ్చింది. ఆమెకు డాక్టర్ మధుసూదన్ సిజేరియన్ చేశారు. అలాగే అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం, గంపనపల్లెకు చెందిన మేఘ రెండవ కాన్పులో మగబిడ్డను ప్రసవించింది. వీరిద్దరూ లీపు బేబీలు కావడంతో పలువురు ఆసక్తిగా చూశారు.



పుంగనూరు: తన కుమారుడితో మేఘ

ఇదో గొప్ప విషయమే



“ నాలుగేళ్లకోసారి వచ్చే లీపు సంవత్సరంలో ఫిబ్రవరి 29న జన్మించిన పిల్లలు పెరిగి పెద్దవారయ్యాక సైతం సమాజంలో ఓ ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. ఎందుకంటే వారికి పుట్టినరోజు ఏటా రాదు కాబట్టి. నాలుగేళ్లకోసారి వారు జన్మదినం పండుగలా చేసుకుంటారు. ఏదేమైనా లీప్ బేబీలకు ప్రత్యేకతే వేరుగా ఉంటుంది. – డాక్టర్ శారద, ఆర్ఎంఓ, పలమనేరు

వీళ్లంతా స్పెషల్



లీపుసంవత్సరంలో జన్మించిన పిల్లలకు జీవితంలో ఎన్నటికీ ప్రత్యేకత ఉంటుంది. అందరికీ భిన్నంగా వీరు నాలుగేళ్లకోసారి జన్మదినం జరుపుకోవడంతో వీరిలో స్పెషల్‌గా కొన్ని నైపుణ్యాలు అలవడే అవకాశం ఎక్కువ. వీరు ఎక్కువగా తెలివిని కలిగి ఏదేని రంగంలో బాగా రాణించగలుగుతారు. ఫిబ్రవరి 29 బర్త్‌డే అంటే ఆ కిక్కే వేరు. – డాక్టర్ రజని, ఫిజియోథెరపిస్ట్, పలమనేరు

వలంటీర్లకు సన్మానం



పుంగనూరులో వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

- ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

పుంగనూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థ చేసిన, చేస్తున్న సేవల గురించి ఎంత చెప్పినా తక్కువేనని, ప్రత్యేకించి కరోనా సమయంతో వారి సేవలను ఎవరూ మరచిపోలేరని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి అభినందించారు. గురువారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంగమునిరెడ్డి వలంటీర్లకు సేవా వజ్ర అవార్డులు పొందిన జి.గోవిందు, బిందుసారికలకు, సేవారత్న అవార్డులు పొందిన జగదీష్, జగదీశ్వరి, మమత, విజయకుమారి, గణేష్‌లకు అవార్డులు, ప్రశంసా పత్రాలు, నగదు అందజేసి సన్మానించారు. వారి సేవలను ప్రస్తుతించారు. మండలంలో 274 మంది వలంటీర్లకు అవార్డులు ప్రదానం, సన్మానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు జయరామిరెడ్డి, సురేంద్రరెడ్డి, శంకరప్ప, నంజుండప్ప, మునస్వామి, విజయభాస్కర్‌రెడ్డి, బాబు, సుబ్రమణ్యం, రమణ, బాబ్‌జాన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించండి

గుడుపల్లె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలకు సంబంధించిన సంక్షేమ పథకాలపై సంఘ సభ్యులకు అవగాహన కల్పించాలని ఎంపీపీ వరలక్ష్మి అన్నారు. గురువారం శ్రీశక్తి భవనంలో మండల సమైఖ్య లీడర్లకు, సంఘమిత్రలకు సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, సున్నావడ్డీ రుణాలు అందించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. గ్రామాలలోని సంఘాల సభ్యులకు వివిధ పథకాలు గురించి తెలియజేయాలన్నారు. ప్రతి కుటుంబంలో మహిళలు ఆర్థికంగా ఎదగడానికి నవరత్నాల పథకాలు ఎంతో ఉపయోగపడ్డాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని వచ్చే సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్ సీపీని మహిళలు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసులు, సీసీలు కాంతారావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వరలక్ష్మి

మున్సిపల్ కమిషనర్‌గా నాగేశ్వరరావు

కుప్పం: కుప్పం మున్సిపల్ కమిషనర్‌గా నాగేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆత్మకూరు నుంచి బదలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. ఇక్కడ కమిషనర్గా పనిచేస్తున్న రాధిక తిరుపతి కార్పొరేషన్ బదిలీ అయ్యారు. నూతన కమిషనర్‌కు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, కౌన్సిల్ సభ్యులు స్వాగతం కలికారు.



కమిషనర్‌కు స్వాగతం పలుకుతున్న చైర్మన్, కౌన్సిల్ సభ్యులు

టెట్ పరీక్ష కేంద్రం తనిఖీ

గంగవరం: మండలంలో నిర్వహిస్తున్న టెట్ పరీక్షల్లో భాగంగా మదర్‌థెరిసా కళాశాల పరీక్ష కేంద్రంలో మూడవ రోజు గురువారం ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు ప్రశాంతంగా సాగాయి. మొత్తం 323 మందిలో 40 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ-1 వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాన్ని డీఈఓ దేవరాజు, డీవైఈఓ చంద్రశేఖర్ తనిఖీ చేశారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

గంగవరం: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు మండలంలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సంబంధిత అధికారులు గురువారం తెలిపారు. మండలంలో మూడు సెంటర్లను ఏర్పాటు చేశారు. మదర్‌థెరిసా కళాశాలలో 540, సాయి చైతన్య కళాశాలలో 420, వివేకానంద కళాశాలలో 446 మంది పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు.

వైష్ణవీదేవి సేవలో శ్రీశైలం స్వామీజీ

చౌడేపల్లె: పుదిపట్ల సమీపంలోని శ్రీ వైష్ణవీదేవి అమ్మవారిని గురువారం ఏకవీర సేవా ఫౌండేషన్ శ్రీశైలం స్వామీజీ ప్రతాప్ స్వామీజీ దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త వినోద్‌కుమార్ రెడ్డి తీర్థప్రసాదాలు అందజేశారు.

జగనన్న కాలనీ ఇళ్ల పనుల పరిశీలన

రొంపిచెర్ల: జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు వేగవంతం చేయాలని మండల హౌసింగ్ ఏఈ యోగానంద్ కోరారు. మండలంలో బొమ్మయ్యగారిపల్లె, రొంపిచెర్ల పంచాయతీలలోని జగనన్న కాలనీలలో జరుగుతున్న ఇళ్ల పనులను గురువారం ఆయన పరిశీలించారు. జగనన్న కాలనీలకు మౌలిక సదుపాయాల పరంగా సీసీ రోడ్లు, మురుగునీటి కాలువలు, తాగునీరు, విద్యుత్ వసతి కల్పిస్తున్నామన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన

సదుం: హెచ్‌ఐవీపై జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, నాగరాజ కళాబృందం ఆధ్వర్యంలో గురువారం సదుంలో కళాజాత నిర్వహించారు. వ్యాధి సంక్రమించే విధానం, సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను బృంద సభ్యులు వివరించారు. వ్యాధి బారిన పడినవారు భయపడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందని లఘు నాటికలు, గేయాలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గీతాంజలి, మునిరత్నం, మల్లికార్జున, దివ్య, రాజేశ్వరి, గణేష్ పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలోనే ఇదో చరిత్ర



విద్యార్థులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను నాడు–నేడు పథకం కింద సమూలంగా మార్చివేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యావ్యవస్థలోనే సరికొత్త చరిత్ర సృష్టించారని, దేశానికే ఆదర్శవంతంగా మన ప్రభుత్వ స్కూళ్లు ఉంటున్నాయని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. గురువారం పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో నాడు–నేడు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ప్రతి తరగతి గదికీ వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం ఎలా ఉంటున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ, గతంలో ఏ ప్రభుత్వం కూడా విద్యారంగానికి ఇవ్వనంత ప్రాధాన్యతను సీఎం ఇచ్చి, దేశం మనవైపు చూసేలా చేశారన్నారు. డిజిటల్ విద్యాబోధన, కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా మౌలిక వసతులతో కల్పించడంతో అడ్మిషన్లు గణనీయంగా పెరిగాయన్నారు.

ఉత్తమ సమాజ స్థాపకులు గురువులు

- ఎమ్మెల్యే వెంకటేగౌడ, పూతలపట్టు ఇన్‌చార్జి డాక్టర్ సునీల్‌కుమార్



ఉద్యోగ విరమణ పొందిన హెచ్‌ఎం శ్రీనివాసులును సన్మానిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, సునీల్‌కుమార్

పెద్దపంజాణి: ఒక గొప్ప సమాజం నిర్మాణానికి గురువులే స్థాపకులుగా ప్రధాన భూమిక పోషిస్తారని ఉంటారని ఎమ్మెల్యే వెంకటేగౌడ, పూతలపట్టు ఇంచార్జి డాక్టర్ సునీల్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని రాయలపేట ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో వీరు హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తిలో సుదీర్ఘకాలం పనిచేసి ఎందరో ఉత్తమ విద్యార్థులను సమాజానికి అందించిన ఉత్తమ గురువు కోడిపుంజుల శ్రీనివాసులని ఆయన సేవలను కొనియాడారు. అలాగే జగనన్న ప్రభుత్వం పాఠశాలల కోసం నాడు–నేడు, అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, గోరుముద్ద.. ఇత్యాది పథకాల అమలుతో నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించి పిల్లలందరికీ మేనమామగా చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. అనంతరం శ్రీనివాసులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, పార్టీ మండల కన్వీనర్ బాగారెడ్డి, వైస్ ఎంపీపీ ఆంజమ్మ, కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, జిల్లా కార్యదర్శులు సుహేబ్, మాకయ్య, పార్టీ నాయకులు మునిరాజు, గురునాథరెడ్డి, ఎంఈఓ గోపాల్‌రెడ్డి, పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ టీచర్‌కు సన్మానం

వి.కోట: మండలంలోని బైరుపల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు జయపాల్ గురువారం ఉద్యోగ విరమణ పొందారు. మండల విద్యాశాఖ పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో జయపాల్‌కు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించింది. ముఖ్యఅతిథిగా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు హాజరై జయపాల్ సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు ఇలియాజ్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దేవదానం సేవలు చిరస్మరణీయం

చౌడేపల్లె: ఉపాధ్యాయునిగా వృత్తి ధర్మం నిర్వర్తిస్తూనే మరోవైపు సమాజసేవా కార్యక్రమాల్లో తన వంతుగా చేయూతనిస్తూ, పేద విద్యార్థులకు ఆదుకుంటున్న తెలుగు పండితులు దేవదానం సేవలు చిరస్మరణీయమని జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి ప్రస్తుతించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న దేవదానం గురువారం ఉద్యోగ విరమణ పొందారు. ఆయనకు పలువురు టీచర్లు, ప్రజాప్రతినిధులు వీడ్కోలు సన్మానం చేసి సేవలను కొనియాడారు. ఉత్తమ తెలుగు పండితులుగా ఆయన ప్రభుత్వం నుంచి అవార్డు సైతం అందుకోవడం విశేషమన్నారు. కార్యక్రమంలో బోయకొండ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ, ఎంఈఓలు కేశవరెడ్డి, తిరుమలమ్మ, హెచ్‌ఎం నాగరాజురెడ్డి పాల్గొన్నారు.



జయపాల్‌ను సన్మానిస్తున్న జెడ్పీ చైర్మన్



చౌడేపల్లె: దేవదానం దంపతులను సన్మానిస్తున్న జెడ్పీటీసీ



సుబ్రమణ్యం దంపతులను సన్మానిస్తున్న రెస్కో సిబ్బంది



పలమనేరు: సరోజ సేవలను ప్రస్తుతిస్తున్న ఆస్పత్రి వైద్యులు

రెస్కో ఎండీ ఉద్యోగ విరమణ


కుప్పం: కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (రెస్కో) ఎండి పి.సుబ్రమణ్యం పదవీ విరమణ పొందారు. గురువారం రెస్కో కార్యాలయ ప్రాగణంలో సిబ్బంది, పలువురు రాజకీయ నాయకులు సుబ్రమణ్యం దంపతులను సన్మానించారు. 36 ఏళ్ల సర్వీసులో ఆయన రెస్కోలో ఉద్యోగిగా కాలక్రమంలో ఎండీ స్థాయికి చేరి చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు.

సరోజ సేవలు మరువలేనివి

పలమనేరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ సరోజ గురువారం ఉద్యోగ విరమణ పొందారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాయక్, ఆర్ఎంఓ డాక్టర్ శారద, వైద్య సిబ్బంది ఆమెను ఘనంగా సత్కరించారు. ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ మమతారాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బంపరాఫర్.. హోల్‌సేల్ ధరలకే సరుకులు

- సూపర్ బజార్ అధ్యక్షులు సుభాష్ చంద్రబోస్



పలమనేరు: పట్టణంలోని బాలాజీ సహకార సూపర్ బజార్‌లో మార్చి నెలంతా ప్రజలకు హోల్‌సేల్ ధరలకే సరుకులు, దుస్తులు మొదలైనవి విక్రయిస్తామని బాలాజీ సహకార సూపర్ బజార్ అధ్యక్షులు సుభాష్ చంద్రబోస్ ప్రకటించారు. స్థానిక సూపర్‌బజార్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సహకార రంగంలో ఉమ్మడి రాష్ట్రంలోనే ఎక్కువ టర్నోవర్‌తో లాభాలు ఆర్జించే సూపర్‌బజార్‌గా పలమనేరు సూపర్‌బజార్ ఉందన్నారు. ఇప్పటికే లాభాల బాటలో ఉన్న సూపర్ బజార్‌లో ఖాతాదారులు, సభ్యులు, ప్రజలకు హోల్‌సేల్ ధరకే అన్ని రకాల వస్తువులను విక్రయించాలని పాలకమండలి నిర్ణయం తీసుకుందన్నారు. దీంతో ఆదివారం సెలవు దినాల్లోనూ సూపర్‌బజార్ తెరచి ఉంటుందని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఖాతాదారుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న సహకార రంగ సంస్థపై కొందరు టీడీపీ నేతలు పనికట్టుకుని విమర్శించడం సరికాదని హితవు పలికారు. టీడీపీ నేతలు కూడా ఇక్కడ కొనుగోలు చేయవచ్చన్నారు.

ఘనంగా సల్లాపురెమ్మ జాతర



వి.కోట: ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శమిస్తున్న సల్లాపురెమ్మ



పలమనేరు: ఆరిమాను గంగమ్మ జాతరలో ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: పట్టణంలోని చౌడేపల్లిలో సల్లాపురెమ్మ జాతరను గురువారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. తిరుపతి గంగమ్మ, నడివీధి గంగమ్మ, యల్లమ్మ, సల్లాపురెమ్మ అమ్మవార్ల శిరస్సులను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ జాతరకు ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామస్తులు వెళ్లి వందలాది మంది వారం ముందే గ్రామానికి చేరుకుని జాతర ఏర్పాట్లల్లో నిమగ్నమవడం పరిపాటి. ఈ సందర్భంగా ఉదయం గ్రామ దేవతలకు మహిళలు దీపాలు మోసి, పొంగళ్లు పెట్టి, మొక్కులు చెల్లించారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి సైతం భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. బాణసంచా వేడుకలు, డప్పుల మోత నడుమ సల్లాపురెమ్మ ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. అనంతరం గ్రామ నడిబొడ్డున అమ్మవారిని కొలువుదీర్చి దీపాలను సమర్పించారు.

కొత్తయిండ్లులో..

బైరెడ్డిపల్లె: మండలంలో కొత్తయిండ్లులోని శ్రీ సల్లాపురెమ్మ ఆలయంలో బుధవారం రాత్రి అమ్మవారి జాతర వైభవంగా నిర్వహించారు. గ్రామ పొలిమేరల్లో అమ్మవారి శిరస్సుకు ప్రత్యేక పూజలు చేసి గ్రామ వీధుల్లో ఊరేగించారు. గురువారం ఉదయం ఆలయం వద్ద ప్రతిష్ఠించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. రాజంపేట వైఎస్సార్ సీపీ ఎన్నికల పరిశీలకులు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, మండల కన్వీనర్ కార్తిక్, సర్పంచ్ రేణుక, ఎంపీటీసీ లక్ష్మమ్మ, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

ఆరిమాను గంగమ్మ జాతరలో ఎమ్మెల్యే

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లె పంచాయతీ గొల్లపల్లెలో ఆరిమాను గంగమాంబ జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వెంకటేగౌడ మండల వైఎస్సార్‌సీపీ నేతలతో కలసి హాజరయ్యారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆయన్ను సత్కరించారు. గ్రామ సర్పంచ్ గోవిందుస్వామి, వైస్ సర్పంచ్ నరసింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ మునిరత్నం, నాయకులు అమరనాథరెడ్డి, వీరభద్ర, మనోజ్‌రెడ్డి, సంతోష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.